క్లుప్తంగా

గాయత్రీమాతకు పూజలు

కడప కల్చరల్ : కడప నగరంలోని దేవునికడప లోగల శ్రీ గాయత్రీమాత ఆలయంలో శనివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా మొదటిరోజు అమ్మవారికి గణపతిపూజ, వాసుదేవ పూజ, పుణ్యాహవాచనం కలశ ప్రతిష్ఠ, మూల మూర్తికి శుద్ధజలంతో అభిషేకం, అనంతరం పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రోచ్చాటనలతో అమ్మవారికి పూజలు చేశారు. శ్రీ చక్రానికి కుంకుమార్చన, నివేదన, హారతి, మంత్రపుష్ప సమర్పణ తదితర పూజలు నిర్వహించారు.

దుర్గమ్మ సేవలో విశ్రాంత న్యాయమూర్తి



పూజలు చేస్తున్న విశ్రాంత న్యాయమూర్తి సీతాపతి

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి అమ్మవారిని శనివారం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జీవీ సీతాపతి శర్మ దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి ఆలయ సంప్రదాయంతో పూజలు నిర్వహింపజేశారు. ఆలయ విశిష్టత గురించి తెలియజేశారు. అర్చకులు ఆయనకు అమ్మవారి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బిషప్‌లు, పాస్టర్లు, కాంగ్రెస్ నాయకులు కదిరి ప్రసాద్ గౌడ్, చిన్న కుల్లాయప్ప, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కడప కార్పొరేషన్ : శ్రీసాయి యువజన సేవా సంఘం అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సెంట్రల్ జైలు సమీపంలోని వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుమల టింబర్ డిపో వ్యవస్థాపకులు కంచి వెంకట సుబ్బయ్య వర్ధంతి సందర్భంగా ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీ క్రిష్టారెడ్డి, సుబ్బరాయుడు, పి. శివశంకర్, ప్రసాద్, వృద్ధాశ్రమ నిర్వాహకులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని 43వ డివిజన్ రవీంద్ర నగర్‌లో ఇంట్లో గ్యాస్ ప్రమాదం జరిగి నష్టపోయిన బాధితులకు శనివారం కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ నిత్యావసర సరుకులను పంపిణీ చేసి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దినకర్‌రెడ్డి, మహ్మద్ ఆలీఖాన్, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలు

కడప అర్బన్ : కడప నగరంలోని రవీంద్రనగర్‌కు చెందిన వెన్నపూస కాంతమ్మ కుమారుడు వెన్నపూస భాస్కర్‌రెడ్డి (53) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. గత 20 సంవత్సరాలుగా భార్యాపిల్లలకు దూరమైన భాస్కర్‌రెడ్డి, తన తల్లిదగ్గరే వుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 20న అనారోగ్యంతో భాస్కర్‌రెడ్డి మృతి చెందాడు. అతని తల్లి కాంతమ్మ విజ్ఞప్తి మేరకు కడపలోని శ్రీ కాశీవిశ్వనాథ సేవాసమితి వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శనివారం అతని మృతదేహానికి అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్, పురుషోత్తం, దామోదర్, విజయ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



రిమ్స్ మార్చురీలో ఉన్న మహిళ మృతదేహం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో ఈనెల 6న సులోచన (28) అనే పేరుతో గుర్తు తెలియని మహిళను అనారోగ్యంతో చికిత్సకోసం చేర్పించారు. 19న చికిత్స పొందుతూ ఆ మహిళ మృతి చెందింది. మృతురాలి బంధువులు ఎవరైనా వుంటే ఆధారాలను తీసుకుని వచ్చి తమను సంప్రదించాలని ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు శనివారం తెలియజేశారు.

రికార్డుల పరిశీలన

కడప అర్బన్ : కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. రౌడీషీటర్లు, అనుమానితుల రికార్డులను పరిశీలించి ప్రస్తు తం వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళ గస్తీని ముమ్మరం చేయాలని, అర్ధరాత్రి ఎవరైనా తిరిగితే పూర్తి స్థాయిలో వారిని విచారించాలన్నారు. కడప నగరంలో పోలీస్ 30 యాక్ట్ అమలులో వుందని, అనుమతులు లేకుండా సభలు, ర్యాలీలు నిర్వహించినా ఉపేక్షించకుండా కేసు నమోదు చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 31 రాత్రి ఎక్కడ కూడా అల్లర్లు జరుగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు.

జన హృదయ నేత వైఎస్ జగన్



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



జెడ్పీ వద్ద అన్నదానం కార్యక్రమం ప్రారంభిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, సురేష్‌బాబు



నగరంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు

- ఘనంగా మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదినం
- సేవా కార్యక్రమాలు నిర్వహించిన పార్టీ నేతలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు కడప నగరంలో ఘనంగా జరిగాయి. వైఎస్ జగన్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నగరమంతా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గుంటి నాగేంద్ర ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి తదితరులు భారీ కేక్‌ను కట్ చేశారు. కేక్‌ను ఒకరినొకరు పంచుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని మొక్కవోని ధైర్యంతో పార్టీని 2019లో అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఆయన ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

■ అనంతరం డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు త్యాగరాజు ఆధ్వర్యంలో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణవేణి ఆధ్వర్యంలో పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

■ ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, పి. జయచంద్రారెడ్డి, బీహెచ్ ఇలియాస్, హఫీజుల్లా, సీహెచ్ వినోద్, రామ్మోహన్‌రెడ్డి, బాలస్వామిరెడ్డి, షఫీ, కరిముల్లా, పవర్ అల్తాఫ్, అరీఫుల్లాబాషా, రామక్రిష్ణ, గోపాలక్రిష్ణ, మహిళా నేతలు టీపీ వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, మూలే సరస్వతి, తులశమ్మ, సునీత, మల్లీశ్వరి పాల్గొన్నారు. అనంతరం పి. రవీంద్రనాథ్‌రెడ్డి, సురేష్ బాబు, అంజద్ బాషాలు హెడ్‌పోస్టాఫీసు సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి గజమాల వేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత పార్టీ నాయకులు వివిధ చోట్ల ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

■ వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, ఎన్ఆర్ఐల ఆధ్వర్యంలో స్థానిక పాతరిమ్స్‌లోని అల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లాబకాష్, ఎన్ఆర్ఐలు సయ్యద్ అక్రం, షేక్ అన్సర్, గయాజ్, బాబు బాయ్, ఫారూఖ్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

■ జిల్లా పరిషత్ సర్కిల్ వద్ద వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు రహీమ్ ఆధ్వర్యంలో వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివ, మియ్యా పాల్గొన్నారు.

■ నగరంలోని మాచుపల్లి బస్టాండు వద్ద వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్‌బాషా, జహీర్, గౌస్ పాల్గొన్నారు.

■ జిల్లా పరిషత్ వద్దనున్న ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహంలో విద్యార్థి విభాగం నాయకుడు సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పవర్ అల్తాఫ్, షంషీర్ పాల్గొన్నారు.

■ నగరంలోని బాసట చిల్డ్రన్స్ హోమ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.షఫీవుల్లా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, చిన్నారులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ వినోద్, మురళీ, రఘు, కుమార్, రాయల్‌బాబు పాల్గొన్నారు.

■ పాత మున్సిపల్ కార్యాలయంలో వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు జాషువా, నగర అధ్యక్షుడు ఏ1 నాగరాజు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. షేర్‌ఖాన్ పాల్గొన్నారు.

■ రూకవారిపల్లె సచివాలయం ఎదురుగా వైఎస్సార్‌సీపీ నాయకులు పోతుల శివారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాసీమ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి కేక్‌కట్ చేశారు.

■ శంకరాపురంలోని నమస్తే బోర్డు వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు రాణాప్రతాప్, మాజీ కార్పొరేటర్ జమ్మిరెడ్డి, సింధు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జగనన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీనాయకులు పి.క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.



అల్‌షిఫా కేంద్రంలో పండ్లు పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు



నగరంలోని మాచుపల్లి బస్టాండ్ వద్ద అన్నదానం



బాసట చిల్డ్రన్స్ హోంలో పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏసు ప్రభువు సర్వజనులకు రక్షకుడు



క్రిస్మస్ కేకు కట్ చేస్తున్న నగర ప్రముఖులు

కడప కల్చరల్ : ఏసుప్రభువు సర్వజనులకు రక్షకుడని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. శనివారం రైల్వే స్టేషన్ వద్దగల ఆరోగ్యమాత చర్చిలో ఆమూరి బాలదాసు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి ఒకరినొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చర్చి డైరెక్టర్, పాదర్లు ప్రసాద్‌రావు, మహేష్‌లు క్రిస్మస్ ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి, శివ కొండారెడ్డి, సలావుద్దీన్ తదితరులు మాట్లాడారు.

విలువలతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న స్వామి సన్నివాసనంద

కడప కల్చరల్ : నేటితరం విద్యార్థులు, యువతకు విలువలతో కూడిన విద్య అవసరమని రామకృష్ణ మఠం కార్యదర్శి స్వామి సన్నివాసనంద అన్నారు. శనివారం బాలికోన్నత పాఠశాలలో ఆయన యువ జాగృతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యువతలో స్వామి వివేకానందుని సందేశాలను వ్యాప్తి చేసేందుకు రామకృష్ణమఠం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా విద్యార్థులు, యువతకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా యువత కోసం యువ జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. యువతలో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, శీల నిర్మాణం అవసరమని, వీటన్నింటికీ విలువలతో కూడిన విద్య పునాదిగా నిలుస్తుందని ఆయన ఉద్బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు అర్హులైన పేదలందరికీ నగరంలో 2 సెంట్ల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణంకు రూ.5 లక్షలు మంజూరుకు వెంటనే యాక్షన్ ప్లాన్ విడుదల చేసి అమలు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి యస్. వెంకట శివ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని మరియాపురం లోని 40వ డివిజన్ సచివాలయం వద్ద వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలకు ముందు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని.. ఆ హామీ అమలు చేయాలన్నారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. సరోజినీనగర్ వద్ద చలమారెడ్డి పల్లె వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ అడ్మిన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు, 40వ డివిజన్ సీపీఐ నాయకులు సావంత్ సుధాకర్, పగడపూల మల్లికార్జున, జీవయ్య, షాజహాన్, నీలావతి, వనజ ,హుస్సేన్ బి, షకీరా బేగం, రజియా సుల్తాన్, జయంతి పాల్గొన్నారు.

బహిరంగ సభ జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా కడప జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు నికర జలాల సాధన కోసం ఈ నెల 28న కడపలో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నామని, వాటిని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ శత వార్షికోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విభజన హామీలయిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెనకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. పోలవరం పూర్తికి నిధులు ఇవ్వాలని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్. వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్. నాగ సుబ్బారెడ్డి, వేణుగోపాల్, బాదుల్లా, గంగా సురేష్, మునయ్య, ఇమ్మానియేల్, నాగేశ్వరరావు, పి. మస్తాన్, శంకర్ నాయక్, మల్లికార్జున, బ్రహ్మం, శివ శంకర్, చంద్ర, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల రిలే నిరాహార దీక్ష



కడపలోని కోర్టు ఎదురుగా రిలే నిరాహార దీక్షలు చేపడుతున్న న్యాయవాదులు

కడప అర్బన్ : ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీఓ నెం. 145కు వ్యతిరేకంగా కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయవాదులు కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో భాగంగా శనివారం 13వ రోజున నిరాహార దీక్షలలో న్యాయవాదులు పి. సంజీవకుమార్, యేసుదాసు, న్యాయవాద గుమస్తాలు కె. వెంకటరమణయ్య, కె. హరినాథ్‌బాబు, ఎల్. ఆంజనేయులు, సి.యోగాంజనేయ రెడ్డిలు పాల్గొన్నారు.

దంత వైద్యంపై అవగాహన

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో శనివారం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ రాయలసీమ జోన్‌కు సంబంధించిన కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ అండ్ ఎండోడాంటిక్స్ కంటిన్యూస్ డెంటల్ ఎడ్యుకేషన్ (సి.డి.ఈ) కార్యక్రమాన్ని నిర్వహించారు. గెస్ట్ స్పీకర్‌గా డాక్టర్ వేణుగోపాల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ దంతవైద్య విద్యార్థులకు రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్‌లో మెలకువలను తెలియజేశారు. దంత వైద్యానికి సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. జ్యోత్స్న, హెచ్ఓడీ డాక్టర్ రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం 12వ జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ కడప జిల్లా సమగ్ర అభివృద్ధి సాధనే లక్ష్యంగా 2025 జనవరి 4 , 5న సీపీఎం జిల్లా మహాసభలు నగరంలో జరగబోతున్నాయన్నారు. మూడు సంవత్సరాల ఉద్యమ సమీక్ష చేసుకొని, భవిష్యత్తు మూడు సంవత్సరాల ఉద్యమ ప్రణాళిక ఈ మహాసభల్లో రూపకల్పన చేసుకుంటామని తెలిపారు. జనవరి 4వ తేదీ ఉదయం 10 గంటల నుండి కడప నగరంలోని జియాన్ కాలేజీ నుండి 'మహా ప్రదర్శన' అనంతరం భారీ బహిరంగ సభ నగరంలోని ఐటీఐ సర్కిల్ గాంధీ పార్క్ వద్ద నిర్వహించబోతున్నామన్నారు. జనవరి 5వ తేదీన ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్మోహన్, ఐఎన్ సుబ్బమ్మ, దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

అభినందన

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ద్వితీయ బీఎస్సీ విద్యార్థిని సి. మనీషా వైవీయూ అంతర్ కళాశాలల యోగ పోటీల్లో ద్వితీయస్థానం సాధించింది. ఈనెల 20వ తేదీన నిర్వహించిన పోటీల్లో కళాశాల విద్యార్థిని రెండోస్థానంలో నిలవడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా అభినందించారు. యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చని, అలాంటి క్రీడలో రాణించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మదన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని యోగి వేమన యూనివర్సిటీ పరిధిలోని కొన్ని బీఈడీ కళాశాలలు అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతున్నాయని అలాంటి కళాశాలల అఫ్లియేషన్ రద్దు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజ్‌లు డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం వైవీయూ ఉప కులపతి కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైవీయూ పరిధిలో ఉన్న కొన్ని బీఈడీ కళాశాలలలో తరగతుల నిర్వహించకుండా ఎటువంటి ల్యాబొరేటరీ లేకపోయినా ప్రభుత్వం కేటాయించిన ఫీజుల కంటే మేనేజ్మెంట్ కోటాలో ఎక్కువ రాబడుతున్నారని ఆరోపించారు. అటువంటి కళాశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ జావిద్ సూచించారు. శనివారం కడప కోటిరెడ్డి సర్కిల్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలు- అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ ఏజ్ విద్యార్థులు వాహనాలను నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దన్నారు. లైసెన్సులు కలిగిన ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించడంతోపాటు తప్పని సరిగా హెల్మెట్‌లను వాడాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలను ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్, ప్రిన్సిపాల్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఫాతిమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో శనివారం చెన్నూరు మండలంలోని దౌలతాపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని ఫాతిమా మెడికల్ కళాశాల సెక్రటరీ ఏక్యూ జవ్వాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, ఈఎన్‌టీ, డెంటల్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, కంటి సమస్యలకు సంబంధించిన వైద్య సేవలను అందించామన్నారు. దాదాపు 150 మందికి పైగా ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఫాతిమా మెడికల్ కళాశాల స్టిబంది పాల్గొన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



బీఎస్పీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నేతలు

కడప రూరల్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఉద్దేశించి పార్లమెంట్ సమావేశంలో అవమానకరంగా వ్యాఖ్యానాలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలకు బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జ్ సగిలి గుర్రప్ప ఆధ్వర్యంలో శనివారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉక్కు సాధన ఐక్య వేదిక అధ్యక్షులు నారాయణ, అఖిల పక్ష కన్వీనర్ సీఆర్‌వీ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఏ సత్తార్ మాట్లాడుతూ ప్రపంచ మేధావిగా కొనియాడబడుతున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అవహేళనగా మాట్లాడడం తగదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తక్షణం కేంద్ర మంత్రి వర్గం నుంచి అమిత్ షాను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటశివ, ఆంజనేయులు, జయవర్ధన్, సుబ్బరాయుడు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన సాధనతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్

ఏఎఫ్‌యూ : ధ్యానసాధన చేయడం ద్వారా మానసికంగా ప్రశాంతత కలుగుతుందని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం పురస్కరించుకుని విశ్వవిద్యాలయంలో ధ్యానపద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యోగ సాధన, ధ్యానం చేయడం ద్వారా సమగ్ర ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. వ్యక్తిత్వ వికాసానికి, ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానం దోహదం చేస్తుందన్నారు. అనంతరం ధ్యానపద్ధతులు, ఆయుర్వేద, ఆధ్యాత్మిక విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎన్. రాజేష్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ విచ్చేసి మానసిన, శారీరక ఆరోగ్యానికి ధ్యానం చేసే మేలు గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మాట్లాడుతూ ధ్యానం వలన మనసుకు ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా విద్యపై విద్యార్థులకు పట్టు లభిస్తుందన్నారు. తక్కువ సమయంలోనే మంచి ఫలితాలను సాధించవచ్చని తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి హిమబిందు ధ్యానం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. జి. విజయలక్ష్మి, డా. పి.శచీదేవి, డా. గురుమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడిని జయించవచ్చు

కడప ఎడ్యుకేషన్ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిడి అధికమించేందుకు మేడిటేషన్ ఎంతో అవసరం అని రామచంద్ర మిషన్‌కు చెందిన హార్ట్‌ఫుల్ వెల్‌నెస్ ఆర్గనైజేషన్ డాక్టర్ గౌరి అన్నారు. శనివారం కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ మెడిటేషన్ దినోత్సవం సందర్భంగా మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక ఒత్తిడి వల్ల చాలా మానసిక రుగ్మతలకు లోనయ్యే అవకాశం ఉందన్నారు. దానిని తప్పించుకునేందుకు ధ్యానం చక్కటి పరిష్కారం అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, ఏఎస్ఎస్ కో ఆర్డినేటర్ నాగ మల్లికార్జున్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తళుకు....తళుకు...క్రిస్మస్ తారలు



చర్చి వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ సెట్టింగ్

కడప కల్చరల్ : జిల్లా అంతటా క్రిస్మస్ తారలు తళుకుమంటున్నాయి. మెల్లమెల్లగా పచ్చని క్రిస్మస్ చెట్లు క్రీస్తు జన్మను స్వాగతిస్తున్నాయి. క్రైస్తవ లోకంలో క్రమంగా ఆనందోత్సాహాలు పుంజుకుంటున్నాయి. కరుణామయుడు ఏసుక్రీస్తు జన్మదినం క్రిస్మస్ పండుగ కోసం జిల్లా అంతటా ఏర్పాట్లు జరుగుతున్నాయి. చర్చిలు, ప్రార్థనా మందిరాలకు మరమ్మతులు చేపట్టి సున్నం, రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. చర్చి కమిటీలు నిర్వహణ కమిటీలతో కలిసి ఏర్పాటు చేస్తున్నారు. క్రిస్మస్ పర్వదినానికి వారం ముందు నుంచి డిశంబర్ 31 వరకు చర్చిల ప్రాంగణాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పలు చర్చిల వద్ద, క్రైస్తవుల ప్రాబల్యంగల వీధి కూడళ్లలోనూ ఇప్పటికే క్రిస్మస్ స్టార్‌లను ఏర్పాటు చేశారు. రాత్రులు ఇవి శోభాయమానంగా వెలుగులీనుతూ ఏసయ్య రాకను తెలియజేస్తున్నాయి. ఈ ఏర్పాట్లు క్రిస్మస్ వాతావరణాన్ని కల్పిస్తున్నాయి.

ధనికుల నుంచి పేదల వరకు ఎవరికి వారు ఉన్నంతలో తమ ఇళ్లను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుకుంటున్నారు. పేదలు తమ ఇళ్లకు సున్నాలు వేయించుకుంటుండగా, ఉన్న వారు ఆకర్షణీయమైన రంగులతో ఇళ్లను కళకళలాడేలా తీర్చిదిద్దుకుంటున్నారు. పనిలో పనిగా నూతన సంవత్సరాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని ఇళ్లను, దుకాణాలను ఆకర్షణీయంగా అలంకరిస్తున్నారు. మార్కెట్‌లో ఇప్పుడిప్పుడే క్రిస్మస్ సామాగ్రి కళ కనిపిస్తోంది. వస్త్ర దుకాణాల్లో క్రిస్మస్ ప్రత్యేక స్టాక్ తెప్పించుకోగా, వ్యాపారాలు కూడా క్రమంగా పుంజుకుంటున్నాయని తెలుస్తోంది. చర్చిల్లోని మత పెద్దలు తమ చర్చిల పరిధిలోని భక్తుల గృహాలకు వెళ్లి క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. క్రిస్మస్‌కు రెండురోజుల ముందునుంచి భక్తి పూర్వక సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించేందుకు యువకులు, బాలలు జోరుగా సాధన చేస్తున్నారు.

ప్రాణాయామంతో ప్రయోజనం

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులు ఏకాగ్రత పెంపొందించుకునేందుకు ప్రతిరోజు కొద్దిసేపు ప్రాణాయామం సాధన చేయాలని బ్రహ్మ కుమారి ప్రదీప అక్కయ్య తెలిపారు. శనివారం కడప నగర శివార్లలోని మా అమ్మ ఒడి అనాథ శరణాలయంలోని చిన్నారులకు ఓం శాంతి సంస్థ ఆంధ్ర- కర్ణాటక సబ్ జోన్ అదనపు ఇన్‌ఛార్జి, సీనియర్ రాజయోగిని గీతా బెహన్ ఆధ్వర్యంలో చిన్నారులకు యోగాసనాల ప్రాధాన్యత వివరించారు. అనంతరం చిన్నారులతో పలు యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రతినిధి పద్మజతోపాటు సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.